ఆశ్రమ పాఠశాలలో అక్షరాస్యత దినోత్సవం

అక్షరం నమూనాలో కూర్చొన్న విద్యార్థినిలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు విద్యార్థినిలు అక్షరం లా కూర్చొని పలువుర్ని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎ.లిల్లీరాణి మాట్లాడుతూ అక్షరాలు అందరికీ నేస్తాలని అన్నారు. జ్ఞానాన్ని అందించేవి అక్షరాలని చెప్పారు. తల్లి ప్రపంచానికి పరిచయం చేస్తే అక్షరం సమాజానికి పరిచయం చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఓవైపు వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు ఖరీఫ్ కాలం మూడు నెలలు దాటిపోయింది. అయినా ఇప్పటికీ పంటల సాగు పెరగడం లేదు. వరి, మొక్కజొన్న మొదులకుని అన్ని పంటల్లోనూ సాగు విస్తీర్ణం తక్కువగానే కనిపిస్తోంది. చివరికి సాగునీటి వనరులు ఉన్న చోట కూడా వరి సాగు లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగలేదు. వరినారు వేసి రెండు నెలలు కావడంతో ఒకవేళ ఇప్పుడు నాట్లు వేసినా పెద్దగా ఉపయోగం ఉండదని రైతులు భావిస్తున్నారు.

దత్తిరాజేరు మండలం పెదకాదలో నాట్లు పడక బీడుగా ఉన్న భూమి

వర్షాలు కురిసినా..
పెరగని సాగు

అన్ని పంటల్లోనూ తగ్గిన విస్తీర్ణం ● సాగునీటి వనరులు ఉన్నచోటా పెరగని దుస్థితి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్ పంటల సాగు జూన్ నుంచి మొదలవుతుంది. రుతుపవనాలు సకాలంలో జిల్లాను తాకితే ఆగస్టు ప్రారంభం నాటికి పంటలన్నీ, ముఖ్యంగా వరి నాట్లు పూర్తయ్యేవి. మారిన వాతావరణ పరిస్థితుల వల్ల గడిచిన నాలుగైదేళ్లగా రుతుపవనాలు ఆలస్యంగా రావడంతో కనీసం ఆగస్టు చివరి దశ లేదా సెప్టెంబర్ రెండో వారం నాటికి వరినాట్లు పూర్తయ్యేవి. మిగిలిన పంటల సాగు కూడా దాదాపు పూర్తికావచ్చేది. ఈ ఏడాది సకాలంలోనే వరి నారు వేసేందుకు వర్షాలు సహకరించినప్పటికీ ఆ తరువాత మండిన ఎండులు, వర్షాభావ పరిస్థితుల వల్ల సకాలంలో ఉబాలు పట్టేందుకు అవకాశం లేకపోయింది. జిల్లాలో ప్రధాన పంట వరి. ఆ తరువాత స్థానంలో చెరకు, మొక్కజొన్న, పత్తి, చిరుధాన్యాలు ఉంటాయి. మొత్తంగా పంటలన్నీ కలుపుకుని గత ఖరీఫ్ సీజన్‌లో 3,02,602 ఎకరాల్లో సాగయ్యాయి. ఈ ఏడాది సుమారు 3,13,465 ఎకరాల్లో సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనావేశారు. కానీ, ఆచరణలో ఇప్పటి వరకు కేవలం 2,24,515 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. గత ఏడాది ఇదే తేదీ నాటికి 2,56,985 ఎకరాల్లో సాగైనట్టు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దీన్ని బట్టి గత సీజన్‌తో పోలిస్తే 78,087 ఎకరాలు, గతేడాది ఇదే సమయంతో పరిశీలిస్తే 32,470 తక్కువగా విస్తీర్ణంలో పంటల సాగు ఉన్నట్టు స్పష్టమౌతోంది.

వరి సాధారణ విస్తీర్ణం 2,25,637 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 1,78,357 ఎకరాల్లో మాత్రమే సాగైంది. గతేడాది ఇదే తేదీనాటికి 1,91,537 ఎకరాల్లోనూ, సీజన్ మొత్తానికి 2,34,107 ఎకరాల్లోనూ నాట్లు పడ్డాయి. సాగునీటి వసతి ఉన్నచోట 2,21,470 ఎకరాల్లో ఉబాలు కావాల్సివుండగా, 1.75,782 ఎకరాల్లో మాత్రమే అయ్యాయి. గత ఏడాది ఇదే తేదీనాటికి సాగునీటి వసతి ఉన్నచోట 1,88,957 ఎకరాల్లో నాట్లు పడ్డాయి.

పత్తి సాధారణ విస్తీర్ణం 8,232 ఎకరాలుకాగా, ఇప్పటి వరకు 3,322 ఎకరాల్లో సాగైంది. గత ఏడాది ఇదే సమయానికి 4,445 ఎకరాల్లోనూ, సీజన్ మొత్తంగా 5097 ఎకరాల్లో సాగైంది. చెరకు సాధారణ సాగు విస్తీర్ణం 18,897 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 7,525 మాత్రమే సాగు కనిపిస్తోంది. గత ఏడాది ఇదే సమయానికి 10,475 ఎకరాలు, సీజన్ మొత్తంగా 11,265 ఎకరాల్లో సాగైంది. నువ్వులు, పెసలు, మినుములు, వేరుశనగ తదితర పంటల సాగు కూడా ఈ మేరకు తగ్గింది.

స్వల్పంగా పెరిగిన వర్షపాతం

నెలవారీగా వర్షపాతంలో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ ఖరీఫ్ సీజన్ మొత్తంగా పరిశీలిస్తే 18.2 మిల్లీమీటర్ల వర్షం అధికంగానే కురిసింది. కానీ, ఆ నెలవారీ హెచ్చుతగ్గులే పంటల విస్తీర్ణం తగ్గిపోవడానికి మూల కారణంగా కనిపిస్తున్నాయి. జూన్‌లో 51.9 మి.మీ వర్షం తగ్గింది. జులైలో 82.4 మి.మీ పెరిగింది. తిరిగి ఆగస్టులో 23.7 మి.మీ వర్షం తగ్గిపోయింది. సెప్టెంబర్‌లో గడిచిన 9రోజులకు 46.4 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సివుండగా 110.4 పడింది. దీంతో, సీజన్ మొత్తంగా వర్షపాతం పెరిగినప్పటికీ సాగుకు అనుకూలంగా లేకపోవడంతో విస్తీర్ణం తగ్గినట్టుగా స్పష్టమౌతోంది.

బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

కలెక్టర్ కృషి అభినందనీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

వరదబాధితుల సహాయంపై అత్యవసరంగా స్పందించిన కలెక్టర్ నిశాంత్‌కుమార్ చేసిన కృషి అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు, తహశీల్దార్ శివన్నారాయణతో కలిసి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఇటీవల పార్వతీపురం ప్రాంతంలో కురిసిన కుంభ వృష్టి వర్షానికి వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించిన వరద నీటి వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలను స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో అత్యవసరంగా పరామర్శించడమే కాకుండా ప్రజల సమస్యను కలెక్టర్, ఇతర అధికారుల దృష్టికి తీసుకొచ్చిన ఫలితంగా అత్యవసరంగా స్పందించిన కలెక్టర్ రాష్ట్ర విపత్తుల శాఖకు సమస్యని నివేదించి అత్యవసరంగా నిధులు మంజూరు చేయిస్తూ నేడు ప్రత్యేక ప్రభుత్వ ఉత్తర్వులను విడుదల చేయించడమే కాకుండా పట్టణంలో బాధితులకు నిత్యావసర సరుకులైన 25 కేజీల బియ్యం, ఆయిల్ ప్యాకెట్, ఉల్లిపాయలు, రూ.2 వేలు ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో ఆర్ఐ రామకృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిల్ సభ్యులు, విఆర్ఒలు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు నగదు పంపిణీ

స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, తహశీల్దార్ శివన్నారాయణ, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి బైపాస్ కాలనీలోని వరద బాధితులకు బియ్యం, నూనె, కాయగూరలతో పాటు 2 వేల రూపాయలు నగదును పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఊరుకోం

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిని ప్రభుత్వం ఉపేక్షించేది లేదని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. శుక్రవారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు లోకేష్ పాదయాత్రల్లో ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. కొంతమంది రౌడీ మూకలతో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ప్రశాంతంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో అలజడి సృష్టించేందుకు కొంతమంది గిరిజన నాయకులతో వైసిపి ప్రభుత్వం పైన, తన పైన తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని చెప్పారు. గడచిన పదేళ్లు గా ఏజెన్సీ ప్రాంత ప్రజలు వైసిపికి అండగా వున్నారనే అక్కసుతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాజన్నదొర ఆరోపించారు.

ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్; వినతులిచ్చేందుకు క్యూకట్టిన ఫిర్యాదుదారులు

సమస్యల పరిష్కారమే ధ్యేయం : కలెక్టర్

ప్రజాశక్తి - సీతానగరం

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమర్పించిన ఆర్జీలకు త్వరితగిన పరిష్కారమే ధ్యేయమని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. అవకాశం ఉంటే తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ స్థాయిలో మండలంలో మొట్ట మొదటి జగనన్నకు చెబుదాం కార్యక్రమం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. జిల్లా జిల్లా కలెక్టర్ స్థాయిలో మండలాల్లో నిర్వహిస్తున్న మొట్ట మొదటి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయి సమస్యలు మండలంలోనే పరిష్కారం కావాలన్నది ప్రభుత్వ అభిమతమని ఆయన వివరించారు. అనంతరం కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఆర్‌డిఒ కె.హేమలత వినతులను స్వీకరించారు .జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 80 ఆర్జీలు అందాయి. స్వీకరించిన వినతుల్లో కొన్ని....

ఇప్పలవలసలో నాలుగు క్వారీలున్నాయని, 30ఏళ్ల నుంచి క్వారీ వారు మైనింగ్ వారికి లీజు చెల్లిస్తున్నారని, ఇప్పటివరకు మా పంచాయతీకి మైనింగ్ వారి నుంచి ఒక రూపాయి కూడా రాలేదని, మా పంచాయతీకి రావాల్సిన లీజు మొత్తం ఇప్పించాల్సిందిగా గ్రామ సర్పంచ్ చింతల లక్ష్మణరావు కోరారు. రెడ్డివానివలసకు చెందిన రెడ్డి లక్ష్మునాయుడు ఎన్‌సిఎస్ షుగర్ ఫ్యాక్టరీని రీఓపెన్ చేయాలని, 2023-24 సీజనకు చెరకును సంకిలి షుగర్ ఫ్యాక్టరీకి తరలిస్తే రవాణా చార్జీలు యాజమాన్యం నుండి ఇప్పించాలని కోరారు. ఇదే గ్రామానికి రెడ్డి ఈశ్వరరావు 2021 నుంచి 2023 వరకు ఆర్.వెంకంపేట రైతు భరోసా కేంద్రానికి ధాన్యం పంపించానని దానికి సంబంధించిన రవాణా చార్జీలు ఇప్పించాలని వినతి పత్రం సమర్పించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు 12 నెలలుగా జీతాలు రాకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నామని, ప్రభుత్వం మాకు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని గ్రీన్ అంబాసిడర్లు సింహాచలం, బి.శ్రీను దరఖాస్తు అందజేశారు. వృత్తి విద్య కోర్సుల్లో పార్ట్ టైమ్ లేబ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని క్రమబద్ధీకరించాలని సిఐటి ల్యాబ్ అసిస్టెంట్ ఎస్.రాజు దరఖాస్తు అందజేశారు. రంగంపేటకు చెందిన వై.ఈశ్వరరావు రంగంపేట గ్రామ పరిధిలో ఖాతా నెంబర్ 625 సుమారు 1-50 ఎకరాల భూమి 12 సబ్ డివిజన్‌లో తన తల్లి పేరున ఉందని, అందులో 176-13 గల సబ్ డివిజన్ 22లో పడిందని, తప్పులని సవరించాలని వినతిని అందజేశారు. పెదబోగిల గ్రామానికి చెందిన గొటివాడ.సంజీవురావు తన భార్య బ్రెయిన్ ట్యూమర్‌తో మరణించిందని, కుమార్తె కూడా డెంగీ తో చనిపోయిందని, తనకు ఒక కుమారుడు ఉన్నాడని, తనకు ఇల్లు లేదని, తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులను గ్రహించి ప్రభుత్వం వారు ఉపాధి కల్పించాలని దరఖాస్తు అందజేశారు. గడ్డలుప్పికి చెందిన పోల.అప్పలనరసమ్మ 901 సర్వే నెంబర్ లో 50 సెంట్లు భూమి ఉందని, పొలంలో పనికి వెళ్లడానికి దారి లేదని, నా పొలానికి వెళ్లి రావడానికి దారి కల్పించాలని కోరారు. సీతానగరం గ్రామానికి చెందిన ఎస్.స్వర్ణలత స్లీపర్ వేతనాలను పెంచాలని కోరారు. పెదబోగిలి పంచాయితీ హడ్కో కాలనీకి చెందిన పైడి పద్మావతి జగనన్న గృహ నిర్మాణం పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. మక్కువ - అజ్జాడ రహదారి మరమ్మతులు చేపట్టాలని, గ్రామంలో రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను మార్చాలని, పెదభోగిలలో సులాభ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ఎస్. జయమని తరపున ఎస్.రామారావు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీతానగరంలో ప్రారంభమైన 'జగనన్నకు చెబుదాం'

జగనన్నకు చెబుదాం షెడ్యూల్ ఇదే

మండల స్థాయిలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమం షెడ్యూల్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఈనెల 13న పార్వతీపురం, 15న బలిజిపేట, 20న కొమరాడ, 22న మక్కువ, 27న గరుగుబిల్లి, 29న పాలకొండ, అక్టోబరు 4న జియ్యమ్మవలస, 6న వీరఘట్టం, 11న కురుపాం, 13న సీతంపేట, 18న సాలూరు, 20న పాచిపెంట, 25న భామిని, 27న గుమ్మలక్ష్మీపురం మండలాల్లో జరుగుతుందని ప్రకటించారు. జిల్లా అధికారులంతా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన అర్జీలు అన్ని జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో నమోదు చేయాలని ఆయన ఆదేశించారు.

11న జట్టు ఆశ్రమంలో యువజనోత్సవాలు

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

జిల్లా స్థాయి యువజనోత్సవాలు (సాంస్కృతిక పోటీలు) ఈ నెల 11న పట్టణంలోని జట్టు ఆశ్రమంలో నిర్వహించనున్నట్టు సెట్విజి ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.రామ్‌గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యువజనోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యాలు (బృందం), జానపద గీతాలు (బృందం), జానపద నృత్యాలు (సోలో), జానపద గీతాలు (సోలో), జీవిత నైపుణ్య విభాగము లో స్టోరీ రైటింగ్ (సోలో), పోస్టర్ మేకింగ్ (సోలో), డిక్లమేషన్ (ప్రకటన) (సోలో), ఫోటోగ్రఫీ (సోలో), వన్ మినిట్ - పర్యావరణ పరిరక్షణపై (సోలో), ఆరోగ్యము మరియు శరీర దడత్వము విభాగంలో యోగా ప్రదర్శన (బృందం) పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో 15-29 ఏళ్ల మధ్య వయస్సున్న యువతీయువకులు పాల్గొనవచ్చును. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు జాతీయస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారు. జిల్లా స్థాయి యువజనోత్సవాలలో పాల్గొనదలచిన వారు ముఖ్యకార్యనిర్వహణాధికారి, సెట్విజ్, కంటోన్మెంట్, విజయనగరం వారి కార్యాలయానికి నేరుగా గాని setviz@yahoo.comకు వాట్సాప్ ఫోన్ నంబర్ 9849199384 లేదా 8247554334 కు గానీ ఈనెల 10న సాయంత్రం 5 గంటల్లోపు మీ దరఖాస్తు పంపాల్సిందిగా తెలిపారు. దరఖాస్తులు అన్ని ఎంపిడిఒ కార్యాలయాల వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. పోటీలను సందర్శించేందుకు అందరూ ఆహ్వానితులేనని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కేటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషన్‌లో శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

కేటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషన్‌లో ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు తిరుపతి స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెూటల్ మేనేజ్మెంట్ కేటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.రమణ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతి జూ పార్క్ వద్ద ఉన్న భారత పర్యాటక శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖలచే సంయుక్తంగా నిర్వహిస్తున్న స్టేట్ ఇనిస్టిట్యూట్ అఫ్ హెూటల్ మేనేజ్ంట్ కేటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్‌లో ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని గ్రామీణ యువతి, యువకులకు శిక్షణ, ఉద్యోగ, ఉపాధి కల్పన నిమిత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి), సీడప్ ఆధ్వర్యంలో దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డిడియుజికెవై) ద్వారా తిరుపతిలోని స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెూటల్ మ్యానేజ్మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ మరియు అప్లైడ్ న్యూట్రిషన్‌లో నైపుణ్యాభివృద్ధి కళాశాల స్థాపించడం జరిగిందని ఆయన అన్నారు. తిరుపతి నైపుణ్యాభివద్ధి కళాశాలలో 4 నెలల వ్యవధి గల డెమీ చెఫ్ ద పార్టీ (కిచెన్ సూపర్వైజర్), 3 నెలల వ్యవధి గల రెస్టారెంట్ కెప్టెన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కల్పిస్తున్నామన్నారు. ఒక్కొక్క కోర్సులో అర్హులైన 30మంది యువతీ యువకులకు శిక్షణ ఇస్తామని, ఇంటర్, ఐటిఐ ఉత్తీర్ణులై, 18 నుండి 28 ఏళ్లు కలిగిన యువత అర్హులని ఆయన చెప్పారు. కార్యక్రమం ద్వారా శిక్షణ పొందే అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామని, అర్హత సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు స్కిల్ ఇండియా సర్టిఫికెట్, ప్రముఖ హెూటళ్లలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 15లోగా రిజిస్ట్రేషన్ చేసుకొని, సదావకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. తద్వారా ఉపాధి పొందాలని ప్రిన్సిపల్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9160912690, 9100558006, 9032697478ను సంప్రదించవచ్చని ఆయన చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు https://rb.gy/6juds రిజిస్ట్రేషన్ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

కార్గో కార్యాలయ సందర్శన

ప్రజాశక్తి - పాలకొండరూరల్

స్థానిక బస్ స్టేషన్‌లో ఉన్న ఎపిఎస్ఆర్టీసి కార్గో రెవెన్యూ కార్యాలయం, పని విధానాలను డిప్యూటీ సిటిఎం బి. అప్పలనాయుడు పరిశీలించారు. అనంతరం బస్సు డిపోను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ పట్నాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగినటువంటి సమావేశంలో. సూపర్వైజర్లు, సిబ్బందితో మాట్లాడుతూ కార్గో రెవెన్యూ పెంచాలని, ప్రయాణికులు చేయి ఎత్తిన ప్రతి చోటా బస్సును ఆపి అందరినీ ఎక్కించుకొని ఎర్నింగ్ పెంచాలని, బస్సుల కండీషను మెరుగుపర్చాలని, ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బస్సులు కలవకుండా టైం పంచ్‌వాల్టీ మైంటైన్ చేయాలని సూచించారు. లింకు బస్సులు లేటు లేకుండా చూడాలన్నారు. స్తానిక బస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో సామాన్లు భద్రపర్చేందుకు పార్సెల్ రూము విస్తరించాలన్నారు. లింకు బస్సులను షెడ్యూల్ మెయింటెనెన్స్ కు టైం ఇవ్వాలని, అలాగే లింక్ లేట్ అయినప్పుడు స్పేర్ బస్సులు ఉంచాలని, పలు సూచనలు, సలహాలు, అప్పలనాయుడు చేశారు. ఈ సమావేశంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ సిస్టు లక్ష్మణరావు, అసిస్టెంట్ ఇంజనీర్ మెకానికల్, ఎంకెఎం రాజు, సెక్యూరిటీ హెడ్ గార్డ్, బి రాంబాబు ,అలాగే ఎస్ టిఐ రోణంకి వెంకటేశ్వరరావు, కె. వెంకట్రావు, మరియు యూనియన్ నాయకులు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

వరద ముప్పు నుంచి కాపాడాలి

సిపిఎం నాయకుల వినతి



డిఆర్ఒ వినతిని అందజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - బెలగాం

జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ పట్టణాల్లోని పలు కాలనీలను వరద ముంపు నుంచి కాపాడాలని, వరద నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని, కాలువలు, గట్లుపై ఏర్పడ్డ ఆక్రమణలను తొలగించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్‌కు వినతిని అందజేసింది. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో పార్వతీపురం పట్టణం జలమయమైందన్నారు. పట్టణంలో వరహాలగెడ్డ ప్రవహిస్తుందని, దీని నీరు వెళ్లేందుకు 40 అడుగుల వెడల్పు కాలువను బడా రాజకీయ నాయకులు పలుకుబడితో పెద్దలు ఆక్రమించుకోవడం ద్వారా పది అడుగుల వెడల్పుకి తగ్గిందన్నారు. దీంతో కాలువ ద్వారా నీరు వెళ్లలేక లోతట్టు ప్రాంతాలైన జనశక్తి కాలనీ, బైపాస్ కాలనీ, సౌందర్య థియేటర్, చైతన్య స్కూలు కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్ , ఎస్సీ హాస్టల్లోకి మూడు, నాలుగు అడుగుల లోతు నీరు చేరిందని, దీంతో ప్రజల తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాలువలు, చెరువుల ఆక్రమణకు పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగందేనని, కావున ఆక్రమణ తొలగించి నీటి మునిగిన వారికి పునరావాసం కల్పించి ప్రత్యామ్నాయ చర్యల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే సాలూరు పట్టణం చెరుకుపల్లి గెడ్డ నీటి వల్ల ఆర్‌టిసి కాంప్లెక్స్ చుట్టూ ఉన్న కాలనీలు నీటమునుగుతున్నాయన్నారు. ఈ గెడ్డ నీరు వచ్చే బంగారంపేట దగ్గర కాలువను ఆక్రమించడం, పూడ్చి వేయడంతో కాలనీలో ఇళ్లల్లోకి వరద నీరు చేరుతుందన్నారు. కావున వరద నీరు వెళ్లడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసి పూడికలు తీసి ఆక్రమణ తొలగించాలని డిమాండ్ చేశారు. పాలకొండ పట్టణంలో మురుగు కాలువల్లో పూడికలు తీయకపోవడం వల్ల నివాస ప్రాంతాల్లోకి మురుగునీరు వెళ్లడంతో వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. జిల్లాలో మూడు పట్టణాల్లోని కాలనీలో ముంపు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, వీటికి ప్రత్యేక నిధులు ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం రాసి డిఆర్ఒ జె.వెంకట్రావుకు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, పట్టణ కమిటీ సభ్యులు ఎస్.ఉమా, బంకురు సూరిబాబు, పి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రజోల సమీపాన ఒంటరి ఏనుగు సంచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో బియ్యాలవలస పంచాయతీ మంత్రజోల సమీపాన ఒంటరి ఏనుగు సంచరిస్తుండడంతో గిరిజన ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం ఉదయం మంత్రజోల సమీపాన ఒంటరి ఏనుగు సంచరిస్తుందని మంత్రజోల, దురుబిలి, పెళ్లి వలస, సూర్యనగరం, నేరడవలస గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామాల గిరిజన ప్రజలు మాట్లాడుతూ ఈ ఒంటరి ఏనుగు కొమరాడ మండలంలో బస్సు అద్దంపై దాడి చేసి మనుషులపై వెంటాడిందని అదే ఏనుగు మా ప్రాంతంలో సంచరిస్తుండడంతో మేము బయటకు రావాలంటే భయమేస్తుందని ఏ క్షణాన ఎవరిపై దాడి చేస్తుందని మేమ అడవికి పొలాలకు వెళ్తే గానీ తమకు జీవనం సాగదని, అటువంటిది ఈ ఏనుగు సంచారం వల్ల బయటకు రాలేకపోతున్నామని కావున అటవీ శాఖ అధికారులు స్పందించి ఏనుగును దూర ప్రాంతాలకు తరలించి మమ్మల్ని ఆదుకోవాలని కోరుతున్నామన్నారు.

మంత్రజోల తోటల్లో సంచరిస్తున్న ఒంటరి ఏనుగు

గరికిపాటికి నివాళ్లు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గరికిపాటికి ఘన నివాళి

ప్రజాశక్తి - పాచిపెంట

డాక్టర్ గరికిపాటి రాజారావు 60 వర్ధంతి స్థానిక కమ్యూనిటీ భవనం వద్ద జానపద కళాకారుడు బొబ్బిలి అప్పారావు, ప్రజాసంఘాల నాయకులు ఏడుకొండలు జరజాపు నూకరాజు ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా డాక్టర్ గరికపాటి రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ రాజారావు వృత్తిపరంగా డాక్టర్‌గా వైద్యం చేస్తూ ప్రజా కళాకారుడిగా నిరంతరం ప్రజలకు చైతన్యం చేస్తూ నాటికలు వీధి నాటికలు ప్రదర్శిస్తూ సమాజ శ్రేయస్సు కోసం పరితపించారని అన్నారు. ఆ రోజుల్లో మూఢనమ్మకాలు, జంతుబలులకు వ్యతిరేకంగా అశాస్త్రీమైన పద్ధతులను నిరసిస్తూ వీధి నాటకాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసిన గొప్ప కళాకారుడని కొనియాడారు. కళ కోసం కాదని, కళ ప్రగతి కోసం ప్రజల కోసం ప్రజల శ్రేయస్సు కోసమని వీధి నాటికల ద్వారా కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తూ ఎంతో మంది ప్రజా కళాకారులను తీర్చిదిద్దిన గరికపాటి ధన్యుడని కొనియాడారు. ఈ సందర్భంగా గరికపాటి రాజారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని గరికపాటి బాటలో ప్రజా కళాకారులు చైతన్యవంతంగా ముందుకు నడవాలని అదే ఆయనకు ఇచ్చిన ఘనమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో పలువురు కళాకారులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న సిపిఎం పట్టణ నాయకులు

తాగునీటి పథకం పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

నిలిచిపోయిన సమగ్ర తాగునీటి పథకం పనులను చేపట్టాలని కోరుతూ సిపిఎం నాయకులు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జె.రామ అప్పలనాయుడుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో పట్టణంలో పురపాలక పరిధిలో నిలిచిపోయిన సమగ్ర తాగునీటి పథకం పనులను చేపట్టాలని,దశాబ్ద కాలంగా పార్వతీపురం పట్టణ ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతూ అనేక రూపాల్లో ప్రజలు నిరసనలు తెలిపారన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎఐబి సాయంతో రూ.63 కోట్ల 63 లక్షలతో సమగ్ర తాగునీరు సరఫరా పథకం పేరుతో నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు ఈ పనులకు ఉప ముఖ్యమంత్రి పి.రాజన్న దొర, ఎమ్మెల్యే అలజంగి జోగారావు శంకుస్థాపన చేసి పందా వీధి వివర నుండి, అడబడి వీధి వరకు పైపులైన్లు వేసి మధ్యలో పనులను నిలిపివేశారన్నారు. ఈ నిలిచిన పనులను ప్రారంభించి పార్వతీపురం ప్రజలు తాగునీరు సమస్య పరిష్కరించాలన్నారు. వినతిని అందించినవారిలో సిపిఎం పట్టణ కమిటీ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, సభ్యులు పాకల సన్యాసిరావు, సంఘం ఉమామహేశ్వరరావు, బంకురు సూరిబాబు,, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న గిరి రఘు

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 22వవార్డు సంకుర్తి వీధిలో శుక్రవారం జెసిఎస్ కన్వీనర్, వార్డు కౌన్సిలర్ గిరిరఘు రూ.5లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గిరిరఘు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం రాజన్నదొర కృషితో పట్టణంలో సంక్షేమ పథకాల అమలు తో పాటు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే జగనన్న సురక్ష, గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రానున్న ఐదేళ్ల లో మున్సిపాలిటీ అభివృద్ధి రూపురేఖలు మారాలంటే మళ్లీ అధికారంలోకి వైసిపి ప్రభుత్వం రావాలని గిరిరఘు కోరారు. కార్యక్రమంలో ఇంఛార్జి డిఇ సూరి నాయుడు, వైసిపి నాయకులు గిరి రాంబాబు (చిన్ని), వార్డు పెద్దలు జంపా శ్యామ్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న ఎంపిపి పద్మావతి

పింఛను కానుకతో ఆర్థిక భరోసా

ప్రజాశక్తి - కురుపాం

వైఎస్ఆర్ పెన్షన్ కానుక పేద వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు అండగా ఉంటూ వారికి ఆర్థికంగా భరోసానిస్తూ ఆదుకుంటుందని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. శుక్రవారం స్థానిక మేజర్ పంచాయతీ కురుపాం సచివాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి ఆరు నెలలకు ఒకసారి కొత్తగా పెన్షన్లు మంజూరు చేస్తూ పేద వృద్ధులు, వికలాంగులు, వితంతువులను ఆదుకుంటున్న వారికి ఆర్థికంగా భరోసా కల్పిస్తూ ధైర్యాన్నిస్తున్న ఏకైక సిఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో కురుపాం మేజర్ పంచాయతీ సర్పంచ్ ఎ.సుజాత, ఉప సర్పంచ్ షేక్‌ఆదిల్, జడ్పిటిసి జి.సుజాత, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, ఎంపిటిసిలు వి.బంగారునాయుడు, టీవీఎస్ స్వామి యోజులు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కె.సురేష్ కుమార్, వైసిపి నాయకులు రాయపిల్లి శ్రీధర్, కె.భూషణ్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి - వీరఘట్టం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మండలంలోని తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆర్.ఉపేంద్ర, వి.వినోద్ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు వై.జగన్ శుక్రవారం తెలిపారు. ఈనెల 9 నుంచి 11 వరకు నెల్లూరు జిల్లా కావలిలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో వ్యాయామ ఉపాధ్యాయులు ఎం రామకృష్ణ, వై ధనలక్ష్మితోపాటు సర్పంచ్ సిహెచ్.మధుసూదనరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ అల్లు శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది,గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

పట్టణంలో గడపగడపకు...

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలో 3,5 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆధ్వర్యాన శుక్రవారం జరిగింది. వీరితో పాటు వైస్ చైర్మన్ రౌతు హనుమంతరావు, పల్లా ప్రతాప్, కౌన్సిలర్ నీలాపు శారదా, వెలమల మన్మధరావు, కడగల వెంకటరమణ, తమ్మినేని శంకర్ రావు, తూముల లక్ష్మణరావు, భాసూరు కాంతారావు, భాను, దుప్పాడ పాపి నాయుడు, కొ కెం సాయికష్ణ బాబీ, వైసిపి నాయకులు మద్దాల చక్రవర్తి, చంద్రమౌళి, లిల్లీ పుష్పనాధం, దుంపల చిన్ని, కేశవరావు, కొరాడ రవి, గురుబిల్లి రవి, పక్కి గురువులు, 3 వ వార్డ్ 5 వార్డ్ పెద్దలు, నగర పంచాయతీ సిబ్బంది, వార్డ్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దుమ్మంగి పంచాయతీ పరిధిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ పాలక క్రాంతి కుమార్ తెలిపారు. శుక్రవారం బెంకిసింగి, గుణద, బొట్టిన, ఆయా గ్రామాల్లో పర్యటించి విద్యుదీకరణ పనులు దగ్గరుండి చేయించినట్లు చెప్పారు. విద్యుత్ దీపాలు లేకపోవడంతో ప్రజలు రాత్రివేళ చిమ్మచీకట్లో ఉండాల్సి వస్తుందని, ఈ కారణంగా ప్రజలు పాముకాటుకు గురవుతూ అనారోగ్యాలకు ఉన్నాయని గుర్తించి విద్యుత్ దీపాలు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. వర్షాకాలంలో రైతులు పాముకాటుకు గురికాకుండా జాగ్రత్త పాటించాలన్నారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు.

12న వాహనాల వేలం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన 15వాహనాలను ఈనెల 12న వేలం వేయనున్నట్లు టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. రెండు ఆటోలు, మూడు కార్లు, ఒక ఓమ్ని ధ్యానంతో పాటు 9మోటార్ సైకిళ్లను మంగళవారం ఉదయం వేలం వేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు వేలంపాట లో పాల్గొనాలని సిఐ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు.

మండల సమావేశం మమా!

- సమస్యలు చెప్పుకోవడమే తప్ప పరిష్కారం శూన్యం
- సభ్యుల ఆవేదన

ప్రజాశక్తి కొమరాడ

మండలంలోని ఏమైనా సమస్యలైనా, అభివృద్ధి అయినా చెప్పుకొనేందుకు మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం ప్రతిసారి లాగానే ఈసారి కూడా మామ అని అనిపించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి శెట్టి శ్యామల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి అధికారులు కూడా పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడం విశేషం. సమావేశానికి సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోయినప్పటికీ కొన్ని శాఖల అధికారులు దిగువ సిబ్బందిని పంపించి తూతుమంత్రంగా సమాచారాన్ని ఇచ్చి పంపంపించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వసభ్య సమావేశానికి అధికారులు ఎందుకు పూర్తి స్థాయిలో హాజరు కాలేదని ప్రశ్న సభ్యుల్లో వినిపించింది. దీంతో స్పందించిన ఎంపిడిఒ మల్లికార్జునరావు సమావేశానికి గైర్హాజరైన అధికారులకు ఫోన్లు చేసి సమావేశానికి రావాలని పిలవడం చర్చనీయాంశమైంది. ఎప్పటిలాగానే వివిధ శాఖల వారీగా అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరాలను టపా టపామని చదివి వినిపించి నివేదికలు తెలియజేశారు. ప్రతి సమావేశంలోనూ ప్రశ్నించే విక్రంపురం, గంగరేగువలస ఎంపిటిసి సభ్యులు దేవకోటి వెంకట నాయుడు, గంట వెంకట నాయుడు, తొడుము సర్పంచ్ జి.సింహాచలం తమ పంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను అధికారులకు వెళ్ళబుచ్చుకున్నారు. ప్రతి సమావేశంలో చెప్పిన సమస్యలను గుర్తు చేయడమే తప్ప కనీసం పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడం చాలా దారుణమని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు-లాబేసు వంతెనపై ఎటువంటి చర్యలు చేపట్టారని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి సమావేశానికి వద్ద వచ్చి నిరసన తెలిపి మాట్లాడారు. ఒకవైపు ఏనుగులు సమస్య మండల ప్రజలను వేధిస్తున్నా కనీసం ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం చాలా దురదృష్టకరమని అన్నారు. మండలంలో గతంలో ఉండే బస్సు సర్వీసులను అధికారులు పూర్తిగా నిలుపుదల చేయడంతో మండల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతి అందజేసి సమస్యలను గుర్తు చేశారు. అనంతరం సభ్యులకు కూడా ఏనుగుల సమస్యలను పార్టీలకు అతీతంగా తీర్మానం చేసి పరిష్కారయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశానికి వచ్చిన అధికారులు పూర్తిస్థాయిలో సంబంధిత ఉన్నతాధికారుల హాజరు కాకపోవడంతో ప్రతి సమావేశంలో చెప్పిన వారు నిర్దేశానికి చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్ ఎంపిపి అన్నపూర్ణ, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ మల్లికార్జునరావు

13న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 13న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బిజె ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మండల స్థాయి అధికారులు ఉదయం 10:30 గంటలకే హాజరుకావాలని ఆయన కోరారు.

ఆదివాసీలను పట్టించుకోకపోవడం అన్యాయం

ప్రజాశక్తి - బెలగాం

కురుపాం నియోజకవర్గంలో సుమారుగా ఐదేళ్లుగా ఏనుగుల గుంపు వివిధ గ్రామాల్లో తిరుగుతూ మనుషులు ప్రాణాలను తీస్తూ కొన్ని కోట్ల రూపాయలు పంట నష్టాన్ని చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం చాలా అన్యాయమని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బా లోవరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏనుగుల గుంపును తరలించకుండా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ఈ ప్రాంత ప్రజలు చాలా ఆవేదన చెందుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఈ సమస్యను పరిష్కరించకపోవడం దారుణమన్నారు. ఆదివాసీలు ప్రతిరోజు తమ ప్రాణాల్ని గుప్పిట్లో పెట్టుకొని బతుకుతున్న పరిస్థితి ఉందన్నారు. తక్షణమే ఏనుగులను తరలించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

15న పార్వతీపురంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా డిప్లొమా, ఏదైనా డిగ్రీ, పీజీ చదువుకొని వయస్సు 18 నిండి 35 సంవత్సరాల మధ్య ఉన్నటువంటి నిరుద్యోగ యువత ఈనెల 15న శుక్రవారం "గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ , పార్వతీపురం"నందు మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుంది. ఈ మినీ జాబ్ మేళాకు టెక్ మహీంద్రా, ఆర్వాన సాఫ్ట్వేర్ సోలుషన్స్ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకోవడం జరుగుతుంది. కావున ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత వారి వివరాలను www.apssdc.in వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా రెస్యూమే, ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్,1 పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు డ్రైవ్ జరుగు ప్రదేశంలో హాజరు కావలసినదిగా ఎపిఎస్ఎస్‌డిసి జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి యూ.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9182398325, 7997299739లో సంప్రదించాలన్నారు.

నర్సిపురంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నర్సిపురంలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి ఉమామహేశ్వరి జ్వర పీడితులతోపాటు, గర్భిణీలు, మధుమేహం, రక్తపోటు, తదితర వ్యాధిగ్రస్తులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతి కుమారి, ఎఎన్ఎం లక్ష్మి, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు లేకుండా చూడాలి

ప్రజాశక్తి - కొమరాడ

రైల్వే అండర్ బ్రిడ్జ్ వద్ద వరద నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. కూనేరు రైల్వే స్టేషన్ సమీపంలో గల మూడవ రైల్వే లైన్ అంతర్ బ్రిడ్జి వద్ద కిందన ఉన్న నీరు వెంటనే తొలగించి అటు వాహనదారులకు, గిరిజన గ్రామాల ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ మేరకు సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో వరదనీటి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కోనేరు రైల్వే స్టేషన్ మాస్టర్ అంకిత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ 15 గిరిజన గ్రామాలకు అతి ముఖ్యమైన ఈ అండర్ బ్రిడ్జి కింద నీటిని వెంటనే తొలగించి గిరిజన ప్రజలకు విద్య, వైద్యం, నిత్యవసర వస్తువులు తమ గ్రామాలకు తీసుకెళ్లేలా రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే మండలంలోని ఉలిపిరి పంచాయతీ సరుడుగూడతోపాటు మరో 13 గిరిజన గ్రామాలకు వెళ్లే రైల్వే లైన్ కింద ఉన్న అండర్ బ్రిడ్జి వద్ద నీటిని తొలగించి అటు గ్రామాలకు వెళ్లే ప్రజలకు, ఇటు ద్విచక్ర వాహనదారులకు భరోసా కల్పించాలన్నారు. సరుగుడుగూడ గ్రామానికి వెళ్లే రైల్వే లైను బ్రిడ్జి వద్ద ఉన్న నీరు కొమరాడ మండలానికి సంబంధించి గుమడ రైల్వే స్టేషన్ సమీపంలో నయా, చిన్న కేర్జల పంచాయతీలకు చెందిన గ్రామాలకు వెళ్లే రైల్వే లైన్ అంతర బ్రిడ్జి కింద అతి చిన్న వర్షానికి కూడా నీరు ఎక్కువ నిల్వ ఉండడంతో ఆ బ్రిడ్జి కింద నుండి వాన దారులు, ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న నీరుని పూర్తి స్థాయిలో తొలగించి ప్రజలకు, వాహనదారులకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉపేంద్ర, రెడ్డి శివున్నాయుడు, పకీరు, లక్ష్మణదొర, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిపోయిన నీటిలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఫ్రైడే - డ్రైడే పక్కాగా నిర్వహించాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాలను పక్కగా జరిపి దోమల వ్యాప్తిని అరికట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సూచించారు. ఈ మేరకు ఆయన సీతానగరం గూడెం వీధిలో వైద్య సిబ్బంది నిర్వహించిన డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. వైద్య సిబ్బందితో ఇంటింటి సర్వే చేపట్టి ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను గుర్తించి పారాబోయించడం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ మలేరియా, డెంగీ తదితర జ్వరాలకు కారణభూతమైన దోమలను నిర్మూలించాలంటే ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. తాత్కాలిక నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని, ఇళ్లల్లో వాడుక నిమిత్తం ఉంచిన నీటిని కూడా ఎక్కువ కాలం ఉంచరాదని, మూతలు ఉంచాలని, వారానికి ఒకటి,రెండు మార్లు తొట్టెలు, కుండీలు, డ్రమ్ములు శుభ్రం చేసి ఎండలో ఆర బెట్టాలని ప్రజలకు, సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. జ్వరాలను గుర్తిస్తే తగు చికిత్స అందజేసి నివారణ చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. డిఐఒ డాక్టర్ టి.జగన్మోహనరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది, సంబంధిత శాఖల సమన్వయంతో ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కె.శిరీష, సిహెచ్ఒ ఎస్‌వి రమణ, వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

సార్వత్రిక విద్యను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - బలిజిపేట

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ సందర్భంగా శుక్రవారం బలిజిపేట మండల కేంద్రంలోని సచివాలయంలో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఇఒ సామల సింహాచలం మాట్లాడుతూ సార్వత్రిక విద్యా విధానం ద్వారా కేవలం రూ.140 ఫీజును స్థానిక సచివాలయంలో చెల్లించి పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో చేరి చదువుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. బడి మధ్యలో మానివేసిన వారు, పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన వారు, వృత్తి పనులు చేసుకునే వారు దూరవిద్యా విధానంలో పదో తరగతి, ఇంటర్ చదువుకోవచ్చన్నారు. దాదాపు రూ.1500 ఫీజు రాయితీని ప్రభుత్వం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో జిఇఆర్ సర్వే వంద శాతం పూర్తి చేయాలని వాలంటీర్ల ను కోరారు. హెచ్ఎంలు, సీఆర్పీలు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు సార్వత్రిక విద్యా కోర్సుల్లో ప్రవేశాలపై అవగాహన కల్పించి, అభ్యర్థులను జాయిన్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎఇఒ కోరారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ బి.సౌజన్య, డిజిటల్ అసిస్టెంట్ జి.ఉషారాణి, సీఆర్పీ శ్రీరామ్, వాలంటీర్లు పాల్గొన్నారు.

కానాకు మరమ్మతులు చేపట్టాలి : జనసేన

ప్రజాశక్తి - బెలగాం

పట్టణంలోని వైకెఎం కాలనీ వద్ద అంతర్రాష్ట్ర రహదారిలో కుంగిన కానాకు మరమ్మతులు చేపట్టాలని జనసేన నాయకులు ఆ కానా వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ మేరకు జనసేన రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బాబు పాలూరి, జిల్లా వంగల దాలి నాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, ఖాతా విశ్వేశ్వర రావు, గుంట్రెడ్డి గౌరీ శంకర్ , కిల్లన అనంత్, సీతానగరం మండల అధ్యక్షుడు పాటి శ్రీనివాస రావు వారు మాట్లాడుతూ నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే అంతర్రాష్ట్ర ఒడిస్సా రహదారిలో కానా కృంగిపడిపోయి నెలలు కావస్తున్న పాలకుల్లో, అధికారుల్లో కనీస చలనం లేకపోవడం బాధాకరమన్నారు. నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగించే రహదారిలో జరగకూడని ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. తక్షణమే పాలకులు, అధికారులు స్పందించి కూలిపోయిన కానాను బాగు చేయలేని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీకి చెందిన పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

మహాశక్తితో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - బలిజిపేట

చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టనున్న మహాశక్తితో ప్రజల భవిష్యత్తు గ్యారంటీగా బాగుపడుతుందని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని అరసాడలో మహిళా మహాశక్తి, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో శుక్ర వారం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు పెంకి వేణుగోపాల్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో మహాశక్తి, భవిష్యత్తు గ్యారెంటీ సుమారు 500 మంది మహిళలు కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం జరిగిన రెండు గ్రామాల్లోని సభల్లో ఆయన మాట్లాడుతూ మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మహాశక్తి, భవిష్యత్తు గ్యారెంటీతో రాష్ట్ర ప్రజలు తప్పక బాగుపడడం జరుగుతుందన్నారు. ఈ పథకాల ద్వారా ప్రతి కుటుంబాన్ని అన్ని విధాలా ఆర్థికంగా ఉపయోగపడే పథకాలపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలో జరుగుతున్న వైయస్సార్సీపి ప్రభుత్వ అరాచక అవినీతి పాలన ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, సీతారాంనాయుడు, చంద్రమౌళి, రామ్మోహన్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ ఎస్.రాంబాబు, జి.బాబ్జీ, జి.సింహాచలంనాయుడు, కె.సింహాచలంనాయుడు, ఎం.చిన్నంనాయుడు, వి జగదీశ్వరరావు, జి.సింహాచలం, కె.రాంబాబు తదితరలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని కేదారిపురంలో బాబు ష్యూర్టీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కురుపాం నియోజకవర్గం ఇంచార్జి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ మేనిఫెస్టో 66 వేల కుటుంబాలని, 1,80,000 ప్రజలను చేరవేయడమే తమ ధ్యేయం అన్నారు. రానున్న 2 ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని, కురుపాంలో టిడిపి జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కడ్రక వెంకటరావు,యూనిట్ ఇన్చార్జి బుజ్జేశ్వరరావు, అడ్డాకుల నరేష్, రామా రావు పాల్గొ న్నారు.

భామిని : టిడిపిని గెలిపించి, మన రాష్ట్రం అభివృద్ధికి బాటలు వేయాల్సిన బాధ్య త అందరిపైనా ఉందని పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని ఘనసరలో బాబు షూర్టీ, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు భోగాపురపు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, సర్పంచ్ లోపింటి రాజేష్, బూత్ ఇన్‌ఛార్జిలు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

బలిజిపేటలో ప్రచారం చేస్తున్న విజయచంద్ర

నేత్రదానంపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

శరీరంలో ఏ అవయవానికి బాధ కలిగించినా ఆ బాధను కల్లు వ్యక్త పరుస్తాయని, కావున నేత్రదానం చేయడానికి ముందుకు రావాలని నేత్ర వైద్యాధికారి జి.నగేష్ రెడ్డి అన్నారు. నేత్రదానం పక్షోత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్రదానం అనే ప్రక్రియ దాత చనిపోయిన తర్వాతే జరుగుతుందనీ చనిపోయిన వ్యక్తి కంటిలో వున్న నల్లటి పొరను మాత్రమే ఉపయోగిస్తారనీ ఈ నల్లటి పొరను అంధుల కళ్లకు ఉపయోగించడం ఆధునిక వైద్య శాస్త్రం అందించిన ఒక అద్భుత వరం అన్నారు. జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్ బాబు మాట్లాడుతూ నల్లని గుడ్డుపై తెల్లని మచ్చతో కంటి చూపును కోల్పోతున్నారని అటువంటి వారికి " కార్నియా గ్రాఫ్టింగ్ " (నల్లని గుడ్డు మార్పిడి) చేసినట్లయితే ఎందరో అంధులకు తిరిగి కంటి చూపును ప్రసాదించే అవకాశం ఉందని, అటువంటి గుడ్డు మార్పిడి కోసం నేత్రాలను స్వీకరించడానికి, కంటి చూపును కాపాడుకోవడానికి దేశం అంతా కలిసి అంధకారం పారద్రోల డానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం దంత వైద్యాధికారి డాక్టర్ సుకృత, హెడ్ నర్స్ ఈశ్వరమ్మ, నేత్ర వైద్య సహాయకులు శైలజ, మల్లికా, రోజా, కౌన్సిలర్ మోహన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో సమగ్ర సస్యరక్షణ

ప్రజాశక్తి - పాచిపెంట

వరి పంటలో వచ్చే వివిధ పురుగులు, తెగుళ్ల నివారణకు సమగ్ర సస్యరక్షణ నివారణ పద్ధతులు రైతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. విఎఎ బాలకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని అమ్మవలసలో సమగ్ర సస్యరక్షణ విధానాలను తెలియజేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో జిగురు పల్లాలను అమర్చారు. బీజామృతం లేదా సుడోమోనాస్ట విత్తన శుద్ధి అనంతరం వరుసల్లో వరి నాట్లు వేసుకుని జిగురు పల్లాలను లింగాకర్షక బుట్టలను పక్షిస్థావరాలను ఏర్పాటు చేసుకుని గట్లపై బంతి లేదా కూరగాయల విత్తనాలను నాటుకోవాలని తెలిపారు. లింగాకర్షణ బుట్టల ద్వారా కాండం తొలుచు పురుగు ఉనికిని తెలుసుకోవడమే కాకుండా ఎకరానికి 10 లింగాకర్షకు బుట్టలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా పురుగును నివారించుకోవచ్చని తెలిపారు. ఈ బుట్టలు అమర్చడం ద్వారా పచ్చదోమ, సుడిదోమ ఉధృతిని తెలుసుకొని నివారించుకోవచ్చన్నారు. పక్షిస్తావరాలను ఏర్పాటు చేయడం ద్వారా ఎలాంటి ఖర్చు లేకుండా ఆకు చుట్టు పురుగును నివారించుకోవచ్చన్నారు. నాట్లు వేసేటప్పుడు వరి నారు చివర్లు తుంచి నారు శుద్ధి చేసుకోవడం ద్వారా అగ్గి తెగులు, పాము పొడ తెగులు వంటి తెగుళ్లను కొంతవరకు నివారించుకోవచ్చని తెలిపారు. గట్లపై బంతి, కూరగాయలను వేయడం ద్వారా జీవ వైవిధ్యాన్ని పెంపొందించడం ద్వారా మిత్ర పురుగుల సంఖ్యను పెంచి శత్రు పురుగులను అదుపులో ఉంచవచ్చని సూచించారు. అనంతరం ప్రకృతి సేద్య సిబ్బంది ద్వారా రైతులకు ఉచితంగా పసుపు పల్లాలు, కూరగాయల విత్తనాలు, బంతి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి లు విజయ్, సురేష్, రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - కురుపాం

ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన మండలంలో గుమ్మిడిగూడ పంచాయతీ గుజ్జుపాడులో చోటుచేసుకుంది స్థానిక ఎస్సై సిహెచ్ ప్రసాద్ అందించిన వివరాలు ప్రకారం బిడ్డిక కళావతి గుజ్జుపాడులో తన ఇంట్లో ఈనెల 3న విషయం తాగింది. అపస్మాకర స్థితితో ఉన్న ఆమెను బంధువులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఈనెల 4న పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా రెండు రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందింది. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

మక్కువ: మండలంలోనిశంబరకు చెందిన తీళ్ల భాస్కరరావు(50) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుని గురువారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం భాస్కరరావు మద్యానికి బానిసై కుటుంబాన్ని సరిగ్గా పట్టించుకోవడంలేదని భార్య గౌరమ్మ మందలించింది. దీంతో గురువారం పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే శంబర ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంచడంతో సాలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడచికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య గౌరమ్మ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

బొబ్బిలి మండలం రాజుపేటకు చెందిన డొంకాడ పవన్‌కుమార్ అనే యువకుడు కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో విసిగిపోయి మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు శుక్రవారం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

ఇద్దరికి రిమాండ్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సిలగాం పంచాయతీ చిన్నబెత్తుపురానికి చెందిన సవర కిచ్చాయి (50)ను గతనెల 14న తన గ్రామానికి చెందిన సవర అప్పన్న, సవర చిన్నరావు సిల్లంగి ఉందనే అనుమానంతో చేతులు కొట్టి స్తంభానికి కట్టివేసి గ్రామస్తులు, కుటుంబ సభ్యుల ముందు తీవ్రంగా అవమానించడంతో అవమానభారం భరించలేక అదే రోజు తన ఇంటి ముందు ఉన్న శాలలో ఉరివేసుకొని చనిపోయినాడు. దీనిపై ఆగస్టు 22న తన భార్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కిచ్చాయి మరణానికి కారణమైన సవర అప్పన్న, సవర చిన్నారావును శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఏ నీలకంఠరావు తెలిపారు. ఇటువంటి నేరాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.